


రేపు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని వెటర్నరీ పోలీక్లినిక్ ఆవరణలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఈనెల ఆరో తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జె.రాజగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు జంతువుల యజమానులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించి, పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను వివరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలు, వెటర్నరీ డిస్పెన్సరీలో పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి సంక్రమించకుండా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'తల్లికి' వేదన తీరేనా..?



తల్లికి వందనం పథకానికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం గత నెల 13వ తేదీన అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. అర్హులై ఉండి పథకానికి నోచుకోలేని వారు సచివాలయాలకు వెళ్లి అర్జీలను సమర్పించుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు కావడం, పట్టణ ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో ఆస్తి కలిగి ఉండడం, ఆదాయపు పన్ను, అధికంగా భూ విస్తీర్ణం నమోదు కావడం, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నారన్న తదితర కారణాలతో అర్హులు సైతం తిరస్కరణకు గురయ్యారు. అటువంటి వారికి మరోసారి దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం ఈనెల 8వ తేదీ వరకు రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించింది. తొలి జాబితాలో పేర్లు లేని వారికి ఈనెల పదో తేదీన ప్రభుత్వం డబ్బులు జమ చేయనుంది.

- **తల్లికి వందనానికి 2,658 వినతులు**
- **అత్యధికంగా భూ సమస్యలపై 1062 అర్జీలు**
- **ఈనెల 8వ తేదీ వరకు రీ వెరిఫికేషన్‌కు అవకాశం**
- **పదో తేదీన రెండో విడత నగదు జమ**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో తల్లికి వందనం పథకం కింద 2,28,659 విద్యార్థులకు సంబంధించి 1,52,563 మంది తల్లుల ఖాతాలో ప్రభుత్వం గత నెల 13న రూ.13 వేలు చొప్పున నగదు జమ చేసింది. అన్ని అర్హతలు ఉన్నా పథకానికి నోచని వారు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయట పడుతున్నారు. అర్హుల జాబితా వెలువడిన తర్వాత తమ పేర్లు లేకపోవడాన్ని చూసి చాలా మంది షాక్‌కు గురయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రూ.పది వేల వేతనం పొందుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశా తదితర చిరుద్యోగుల కుటుంబాలకు చెందిన తల్లులను అనర్హులుగా పేర్కొంది. కరెంట్ వినియోగం 300 యూనిట్లు దాటితే అటువంటి కుటుంబాలకూ సాయం నిరాకరించింది. ఐదెకరాల పల్లం లేదా పదెకరాల మెట్టు భూమి ఉన్నా వారినీ అనర్హుల జాబితాలో చేర్చింది. నాలుగు చక్రాల వాహనాలు, ఆదాయపు పన్ను చెల్లించే కుటుంబాలకూ పథకం వర్తింపజేయలేదు. ఈక్రమంలో సాంకేతిక కారణాలతో కొంతమంది అర్హులు సైతం అనర్హులుగా తిరస్కరణకు గురయ్యారు. తల్లికి వందనం నగదు జమ తర్వాతా పెద్దఎత్తున వీటిపై ఆందోళన రేగడంతో తప్పుల సవరణకు అవకాశం కల్పించింది.

తప్పుల సవరణకు మొత్తం 2,658 వినతులు

తప్పుల సవరణకు మొత్తం 2,658 వినతులు వచ్చాయి. అందులో ప్రభుత్వ ఉద్యోగం లేకపోయినా 637 మందికి తప్పుగా నమోదైనట్లు అర్జీ పెట్టుకున్నారు. ప్రభుత్వం పేర్కొన్న విధంగా తమకు అర్బన్ ప్రాంతంలో ఆస్తి లేనట్లు 124 మంది విన్నవించుకున్నారు. తాము ఆదాయ పన్ను చెల్లించకపోయినా, తమకు తల్లికి వందనం డబ్బులు రాలేదంటూ 589 మంది అర్జీలు సమర్పించారు. తమకు గానీ, తమ కుటుంబ సభ్యులకు గానీ నాలుగు చక్రాల వాహనాలు లేవంటూ 246 మంది దరఖాస్తు చేసుకున్నారు.

భూ సమస్యలపైనే అధికం

తల్లికి వందనం పథకానికి వచ్చిన అర్జీల్లో అధిక శాతం భూ సమస్యల పైనే వచ్చాయి. తమ పేరుతో అధిక విస్తీర్ణంలో భూమి నమోదు, జాయింట్ ఎల్‌పిఎం వంటి సమస్యలపై మొత్తం 1062 అర్జీలు వచ్చాయి. జాయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లు, ఆధార్ అనుసంధానంలో తప్పిదాలు, మ్యుటేషన్ల సమస్య కారణంగా భూముల విస్తీర్ణంలో బాగా తేడాలు వచ్చాయి.

ప్రధానంగా జాయింట్ ఎల్‌పిఎం కారణంగా రైతుకు ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్నా వెబ్‌సైట్‌లో 30, 40 ఎకరాల భూమి చూపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పరిష్కారం కోసం గత నెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీంతో వారంతా మరోసారి అర్జీలు పెట్టుకున్నారు. వీటితో విద్యుత్ కనెక్షన్లకు ఒకే ఆధార్ నంబరు అనుసంధానం కావడంతో ఒకటికి మించి అదనంగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్న కారణంతో చాలామంది తల్లులు పథకానికి దూరమయ్యారు.

అందరికీ అదే రోజు నగదు జమ

తల్లికి వందనం పథకానికి అర్హులై పలురకాల కారణాలతో జమ కాని వారికి పున:పరిశీలన తర్వాత ఈనెల పదో తేదీన ప్రభుత్వం నగదు జమ చేయనుంది. కొత్త విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లులకూ డబ్బులను అందించనుంది. అదేవిధంగా పది పాసై ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన వారికీ ఖాతాల్లో డబ్బులు వేయనుంది. దీంతోపాటు బిసి, ఎస్‌సి, ట్రైబల్ సంక్షేమ శాఖల పరిధిలో చదువుతున్న తొమ్మిది, పది, ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఆ రోజే నిధులు జమ కానున్నాయి.



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు కాలరాత

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస డిమాండ్ చేశారు. అఖిల భారత సమ్మెకు సన్నాహకంగా బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన 'లేబర్ కోడ్‌ల అమలు-ఉద్యోగులు, కార్మికులపై ప్రభావం' అనే అంశంపై నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. పని గంటలు పెంచడానికి, యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా ఈ లేబర్ కోడ్‌లు ఉన్నాయన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని, ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. ఈనెల తొమ్మిదో తేదీన అఖిల భారత సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలని కోరారు. బెఫీ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు మండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎన్‌సిబిఇ నాయకులు వెంకట రమణ, బెఫీ నాయకులు కృష్ణబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఐసిఇయు నాయకులు ఆచారి, జన విజ్ఞాన వేదిక నాయకులు గిరిధర్, ఎపిజిబి నాయకులు బి.వి.ఎస్ రావు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 75,566 'బంగారు కుటుంబాలు' గుర్తింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, ఎమ్మెల్యేలు

ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమానికి అనుగుణంగా జిల్లాలో 75,566 కుటుంబాలను గుర్తించామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. పి-4 (పబ్లిక్, ఫిలాంత్రపిస్ట్, పీపుల్ పార్టిసిపేషన్) కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లాకు సంబంధించిన వివరాలను నివేదించారు. జిల్లాలో మొత్తం 75,566 బంగారు కుటుంబాలు గుర్తించినట్లు వెల్లడించారు. వీటిలో ఇప్పటివరకు 181 కుటుంబాలను దత్తత తీసుకున్నామని, ఇంకా 75,385 కుటుంబాలు దత్తత కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు 59,124 కుటుంబాల దత్తత లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు ముమ్మరం చేస్తామని చెప్పారు. నియోజకవర్గాల వారీగా వివరాలను వెల్లడిస్తూ పాతపట్నం నియోజకవర్గంలో అత్యధికంగా 11,572 కుటుంబాలు గుర్తించామని, ఎచ్చెర్లలో 11,024, శ్రీకాకుళంలో 10,324 కుటుంబాలు ఉన్నట్లు వివరించారు. దత్తత విషయంలో ఇచ్ఛాపురంలో 107 కుటుంబాలు దత్తతకు అంగీకరించడంతో, ఆ నియోజకవర్గం ముందుందని తెలిపారు. పేదలను ఆదుకునేందుకు జిల్లాలో మొత్తం 37 మంది మార్గదర్శులు ముందుకొచ్చారని చెప్పారు. పి-4 కేవలం దాతృత్వ కార్యక్రమం కాదని, గ్రామాలు స్వయం సమృద్ధిని సాధించి, స్వయంగా ఇతర గ్రామాలకు సహాయపడే శాశ్వత సామాజిక ఉద్యమంగా భావించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యసాధన కోసం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు పిలుపునిచ్చారు. ఈనెల 15 నాటికి 59,124 కుటుంబాలను దత్తత చేయడం జిల్లాలో ప్రస్తుత ప్రాధాన్యతగా ఉందని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కువైట్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కువైట్ దేశంలో నిర్మాణ రంగంలో సెరామిక్ ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్, పెయింటర్ ఉద్యోగ నియామకాల కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నియామక డ్రైవ్ చేపట్టనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుష అభ్యర్థులు 25 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. ఐటిఐ, డిప్లమోలో సంబంధిత విద్యార్హత ఉండి మూడు నుంచి ఐదేళ్ల అనుభవంతో పాటు ఇంగ్లీష్, హిందీ వచ్చి ఉండాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకి రూ.70 వేలు, వర్కర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ 56 వేలు వేతనాలు ఇస్తారని తెలిపారు. కాంట్రాక్టు కాలం రెండేళ్లు ఉంటుందని తెలిపారు. ఉచిత వసతి, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, వీసా ప్రాసెసింగ్‌తో పాటు స్వదేశానికి ఒక్కసారి వచ్చి పోవడానికి టిక్కెట్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పని అనుభవం, విద్యార్హత ధ్రువపత్రాలు అభ్యర్థులకు ఉండాలని స్పష్టం చేశారు. వివరాలకు 988853335, 8712655686, 8790118349, 8790117279 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటాను skill intarnational@apss-dc.in ఆసక్తి గల వారు ఈనెల 12వ తేదీ లోగా తమ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మొక్కల సంరక్షణ అవసరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డ్వామా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి, పంచాయతీ రహదారులు వెంబడి మొక్కలు నాటి సంరక్షణ చేయాలని సూచించారు. టెక్కలిలో జంగిల్ క్లియరెన్స్ చేసి మొక్కలు నాటినట్లు మండలాల్లోనూ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు, ఉద్యానవన శాఖకు సంబంధించిన సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఉపాధి హామీకి సంబంధించి ఆయా మండలాల్లో పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. చెరువు పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. చెత్త కుండీలు, ఇంకుడు గోతులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం డ్వామా పీడీ సుధాకర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి నిర్ణయించిన పనులు వారు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డ్వామా ఎపిడిలు పి.రాధ, శైలజ, శ్రీనివాసరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫీల్డ్ ఆఫీసర్లు, డ్వామా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, టెక్కలి రూరల్, నందిగాం



మత్స్యకారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. నిమ్మాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఫసల్ బీమా యోజన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేందుకు ఈ బీమా పథకం దోహదపడుతుందన్నారు. జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలకు బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ భూ సమస్యలను వేగంగా పరిష్కరించడం, సేవలను సులభతరం చేయడం అత్యంత కీలకమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని గుర్తించాలన్నారు.

మత్స్యకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలిలోని చిన్న బజారు చేపల మార్కెట్‌లో రూ.49 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, ఆధునీకరణ సముదాయాన్ని శుక్రవారం ప్రారంభించారు. నందిగాం మండలంలోని కవిటి అగ్రహారంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించి సిసి రోడ్లు, కల్వర్టు నిర్మాణాలను మంత్రి ప్రారంభించారు. టెక్కలి చేపల మార్కెట్‌లో చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ వసూలు చేస్తున్న ఆశీలుపై ఆరా తీశారు. చిన్న బజారు కిరాణా, కూరగాయల సముదాయంలోని దుకాణాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు. గతంలో దుకాణాలు నిర్వహించిన దుకాణదారుల జాబితా ప్రకారం లాటరీ ప్రాతిపదికన కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, డివిజనల్ మత్స్యశాఖ అధికారి ధర్మరాజు పాత్రో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులు ఎం.సురేష్, ఎస్.రామకృష్ణ, టిడిపి మండల, పట్టణాధ్యక్షులు బగాది శేషగిరిరావు, కోల లవకుమార్, కోల కామేశ్వరరావు, దల్లి ప్రసాదరావు, ఎల్.ఎల్ నాయుడు, పి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద జిఒలు అమలు చేయాలి

మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమ్మెకాలపు ఒప్పంద జిఒలు అమలు చేయాలని సిఐటియు పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలు అందుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. ఆప్కాస్ ఉద్యోగి అనే పదాన్ని తొలగించి మున్సిపల్ కార్మికులందరికీ (ఇంజినీరింగ్, పారిశుధ్య) తల్లికి వందనంతో పాటు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. చనిపోయిన, 60 ఏళ్లు నిండిన కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని, గ్రాట్యుటీని మంజూరు చేయాలని కోరారు. గతంలో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు, ప్రజలు ఆశించారని, అందుకు భిన్నంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారం, జాతీయ సెలవులు అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో యుగంధర్, జనా, ఎ.లక్ష్మి, ఎ.రాజేశ్వరి, ఎం.రాఘవ, జ్యోతిప్రసాద్, డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి' జీవితం యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



అల్లూరి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

అల్లూరి సీతారామరాజు త్యాగం, వీరత్వం యువతకు మార్గదర్శకం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో అల్లూరి 126వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో నిస్వార్థంగా పోరాడిన గొప్ప యోధుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ సుధాకరరావు పాల్గొన్నారు.

నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల పాలిట అల్లూరి సింహస్వప్నంగా నిలిచారన్నారు. గిరిజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

ఆర్‌బిఐ డిజిఎం జగదీష్

ప్రజాశక్తి - కవిటి

ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రిజర్వు బ్యాంకు డిజిఎం జగదీష్ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహనలో భాగంగా శుక్రవారం కవిటిలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ఫోన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు చేసినప్పుడు అప్రమత్తత అవసరమన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ప్రతి అనవసర సందేశానికి ప్రతిస్పందించకూడదని, సైబర్ నేరగాళ్లు మోసగించేందుకు వేచిచూస్తుంటారని హెచ్చరించారు. పొరపాటున మోసానికి గురైతే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం కవిటి సిహెచ్‌సిలో డయాలసిస్ రోగులకు పళ్లు, గొడుగులు పంచిపెట్టారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌జీ, డాక్టర్ సురేష్, ఉషోదయ సభ్యులు బెందాళం చిట్టిబాబు, ఎ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హత్యలకు వివాహేతర సంబంధమే కారణం

ప్రజాశక్తి - పలాస

సోంపేట, మందసలో సంచలనం సృష్టించిన రెండు వరుస హత్యల కేసును పోలీసులు ఛేదించారు. పలాస మండలం మహదేవుపురానికి చెందిన నిందితుడు ముడియా రామారావును అరెస్టు చేశారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తన ఛాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. సోంపేట మండలం పాలవలసకు చెందిన గోకర్ల రాజేశ్వరితో ఆడపడుచు భర్త మడియా రామారావు వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. రాజేశ్వరి భర్త భర్త చంద్రశేఖర్ ఉపాధి కోసం సౌదీలో ఉంటున్నాడు. వీరి వివాహేతర సంబంధాన్ని గుర్తించిన రాజేశ్వరి ఇంటికి ఎదురుగా ఉండే గోకర్ల ఈశ్వరరావు ఆమెను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న రామారావు ఈశ్వరరావుపై కక్ష పెంచుకుని, అడ్డు తొలగించుకోవాలని భావించాడు. పాలవలస గ్రామ దేవత సంబరాల సమయంలో మే 17వ తేదీన ఈశ్వరరావును సమీప జీడి తోటల్లోకి తీసుకువెళ్లి మద్యం తాగించి హతమార్చాడు. ఈ విషయాన్ని రాజేశ్వరికి చెప్పాడు. తనకు నగదు, ఆభరణాలు ఇవ్వాలని, లేకుంటే వివాహేతర సంబంధంతో పాటు హత్య గురించి అందరికీ చెప్తానని బెదిరించింది. దీంతో ఆమెను కూడా అడ్డు తొలగించుకోవాలని పథకం రచించిన రామారావు, జూన్ 11వ తేదీన డబ్బులు ఇస్తానని నమ్మబలికి పితాళి గ్రామ సమీపంలో జీడితోటల్లోకి తీసుకువెళ్లాడు. చివరిగా ఆమెతో గడిపిన తర్వాత ఆమె చున్నీతోనే మెడకు ఉరి వేసి హతమార్చాడు. అనంతరం ఆమె మెడలోని బంగారు ఆభరణాలు తీసుకుని వెళ్లిపోయాడు. రాజేశ్వరి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించి, నిందితుడిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో కాశీబుగ్గ రూరల్, సోంపేట సిఐలు తిరుపతిరావు, మంగరాజు, మందస ఎస్‌ఐ కృష్ణప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




వివరాలను వెల్లడిస్తున్న కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు


మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై చర్చ

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం పరిధిలోని వజ్రపుకొత్తూరు, మందస మండలాల మధ్య కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్, కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు చర్చలు జరిపారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం రాత్రి వజ్రపు కొత్తూరు మండలం చీపురుపల్లి, అనకాపల్లి, మందస మండలం బిడిమి, బేతాళపురం, గంగువాడ గ్రామాల నాయకులతో ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా...? రైతులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లిస్తే సరిపోతుంది....? రైతులు సమస్యలు ఏమిటి...? తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్గోఎయిర్ పోర్ట్ నిర్మాణంపై ధర్నాలు, నిరసనలు చేస్తున్నారు కదా...? ఎందుకు చేస్తున్నారు, వారి సమస్యలను ఏమైనా పరిష్కారం చేయగలమా తదితర అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మందస, వజ్రపుకొత్తూరు తహశీల్దార్లు ఎం శ్రీకాంత్, సీతారామమూర్తి, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు, ఎస్‌ఐలు, ఆయా ప్రాంతాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

చెత్త సంపద కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మెళియాపుట్టి, పెద్ద పద్మాపురం, పట్టుపురం, చాపరలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు శుక్రవారం సందర్శించారు. పారిశుధ్యంలో భాగంగా గ్రామంలోని డ్రైనేజీలను పరిశీలించారు. అలాగే చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అలాగే గ్రామల్లోని పారిశుధ్యాన్ని పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.


పిహెచ్‌సి ఆవరణలో డొంకలు, తుప్పలు తొలగిస్తున్న కూలీలు

ఎట్టకేలకు పిహెచ్‌సిలో తుప్పల తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

లావేరు: మండల కేంద్రం లావేరు పిహెచ్‌సి ఆవరణలో ఎట్టకేలకు ముళ్లపొదలు, డొంకలు తొలగింపు పనులు చేపట్టారు. చిట్టిఅడవిని తలపిస్తోన్న పిహెచ్‌సి అనే శీర్షికతో జూన్ 30న ప్రజాశక్తిలో కథనం వెలువడడంతో అధికారులు స్పందించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో డొంకలు, ముళ్ల పొదలు, పుట్టలను కూలీలు తొలగించే పనులు చేస్తున్నారు. గతంలో ఆస్పత్రికి వెళ్లాలంటే రోగులు, సిబ్బంది ఎటునుంచి ఏ విషసర్పాలు, కీటకాలు నుంచి ముప్పు వస్తోందోనని భయాందోళన చెందేవారు. ఇప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేయడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన


అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన సిఆర్‌ఎంటి

ఆమదాలవలస: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఈనెల 2 నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ కార్యాలయ సిఆర్‌ఎంటి దుప్పలపూడి శ్రీనివాసరావు, పిటిఐలు బొడ్డేపల్లి పాపినాయుడు, బొడ్డేపల్లి వరహాల నాయుడు తెలిపారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు చింతాడలోని అంగన్వాడీ -1, 2 కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలను కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం సందర్భంగా చింతాడలోని మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఇప్పటికే 12 మంది చిన్నారులను చేర్పించామని అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు. వారి కృషిని అధికారులు అభినందించారు. అంగన్వాడీ కేంద్రాల నుంచి విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాత ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, విద్యార్థులకు ఉత్తమమైన విద్యా బోధన అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జి. భారతి, డి. రాజులమ్మ, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి


నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పెద్ద తామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సి హెచ్ హైమవతి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 109వ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అల్లూరి పోరాట విశేషాలు, ఆయన జీవిత చరిత్ర విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక శంకరరావు, పి.వనిత, పి.దుర్యోధన రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కల్యాణి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఘనంగా అల్లూరి జయంతి నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె సింహాచలం నాయుడు, కల్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి, జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ పిఒ జె పాపారావు, అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, డి.అనసూయ, పి.హరి, కె.గుగాదినాయుడు, బి.శ్రీనుబాబు, కె.కరుణ శ్రీ, డి రమేష్, ఎల్ ఆనంద్, బి.అంజన తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవ్వ పూర్ణచంద్రరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, గణిత ఉపాధ్యాయులు సీర రమేష్ బాబు, ఉపాధ్యాయులు ఎం.అనూరాధ, కె.వెంకటరావు, పడాల తమ్మినాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని ఆరికవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అల్లూరి జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లకినాన వెంకటరమణ, ఉపాధ్యాయులు హరిప్రియ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నందిగాం: చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టెక్కలి: అల్లూరి సీతారామరాజు జయంతి వేడుక స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, కంచరాన శ్రీనివాసరావు, డాక్టర్ లీలాపద్మజ, ధర్మారావు, త్రినాథరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి వాబయోగి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తంప రామారావు, జన్ని రవి, జింజిక సింహచలం, పాపారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పట్టణం పిఎన్ కాలనీ జంక్షన్‌లో విగ్రహానికి శుక్రవారం జనసేన పార్టీ నివాళ్లర్పించింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్, దంతులూరి రమేష్ రాజు, నల్లాన మధు, జనసేన శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కొండా ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నందిగాం: మండలంలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కె కుమారస్వామి, బి.శంకరరావు, కె.సురేష్ కుమార్, ఎం.శివప్రసాద్, గణపతిరావులు శుక్రవారం ఎంఇఒ జి.నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. సేవా పుస్తకాలను అప్డేట్ చేయాలని, విద్యార్థుల ప్రాప్తికి విద్యా కిట్లు అందించాలని, మండల కేంద్రంలో నిర్దిష్టమైన సమయాల్లో విద్యాశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు పోర్టు రహదారి మార్గాలు పరిశీలన

సంతబొమ్మాళి: మండలంలోని మూలపేట పోర్టు నిర్మాణంలో కీలకమైన రోడ్డు, రైలు మార్గాల పరిశీలనకు నేడు టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, వంశధార అధికారి శేఖర్, పోర్టు అధికారులు రానున్నట్లు రైతు సంఘం నాయకులు కోత మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు నుంచి దండు గోపాలపురం వరకు నిర్మిస్తున్న రైల్వే మార్గం, అలాగే నౌపడ మీదుగా టెక్కలి వరకు నిర్మిస్తున్న రహదారి మార్గం పరిశీలించనున్నారన్నారు. ఈ మార్గాల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు, వరదనీటి ప్రవాహానికి అవసరమైన అండర్ పాస్ నిర్మాణాలు, కల్వర్టులు ఎక్కడెక్కడ నిర్మించాలో గుర్తిస్తారన్నారు. ఈ ప్రాంతంలో సుమారు ఐదువేల ఎకరాల పంట భూములు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, దీనికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. కాబట్టి చుట్టుపక్కల ప్రాంత రైతులు, రైతు సంఘాల నాయకులు, మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పుడే అధికారులకు సరైన ప్రణాళికలు ఏర్పాటుకు సూచనలివ్వాలని కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమ వద్ద సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అశేష త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రామకృష్ణ, బి.సురేష్, సత్యన్నారాయణ, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లావేరు: జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.ఉత్తర పిలుపునిచ్చారు. లావేరులో మండల కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం నాయకులు ఎల్.లక్ష్మి, ఎల్.దేవి, కె.సూర్యకుమారి, కృష్ణవేణి, ఇ.కళావతి, బి.అన్నపూర్ణ, ఎల్.ఉమ, ఎల్.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం : మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

సరుబుజ్జిలి: జూలై 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఎ.రాజు, కో కన్వీనర్ కె.సుశీల పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు కె.జ్యోతి, పి.లక్ష్మి, సరస్వతి, జయలక్ష్మి, రమణమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

పి-4 విజన్‌పై సమీక్ష

పలాస: పలాస మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పి4 విజన్‌పై జిల్లా హౌసింగ్ పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి నగేష్ సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికై స్వర్ణ ఆంధ్రప్రదేశ్ పి4 విజన్ 2047 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో కార్యాచరణ రూపకల్పన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎల్‌డిఒ రమేష్ నాయుడు, ఎంపిడిఒ వసంత కుమార్, పి విఠల్‌రావు దువ్వాడ శ్రీకాంత్, భావన దుర్యోధన పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, సెక్రటరీ

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పొందూరు: మండలం రాపాక పంచాయతీలో సర్పంచ్ కొంచాడ వనజ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడతున్నారు. ఇటీవల వర్షాలకు కాలువల్లో మురుగు, చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో వాటిని తొలగించి ట్రాక్టర్‌తో దూరప్రాంతాలకు తరలించి, బ్లీచింగ్ చల్లి శుభ్రపరిచారు. ఈ పనులను సెక్రటరీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

టయోటా కిర్లోస్కర్ మోటార్ సర్వీస్ ప్రారంభం

శ్రీకాకుళం: సర్వీస్, టైర్లు, ఉపకరణాలు, మరిన్నింటిపై అద్భుతమైన ఆఫర్లతో టొయోటా ఈ సీజన్‌లో తమ అద్భుతమైన టొయోటా సర్వీస్ క్యాంపెయిన్‌ను శ్రీకాకుళం టయోటా షోరూంలో అందుబాటులోకి తీసుకువచ్చినట్టు టయోటా కిర్లోస్కర్ మోటార్స్ (టికెఎం) వైస్లెన్సిగామణి శుక్రవారం తెలిపారు. పెదపాడు రోడ్డులోని టికెఎం షోరూమ్‌లో శుక్రవారం ఆయన క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అధీకృత టొయోటా డీలర్‌షిప్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం, వర్షాలకు వాహనాన్ని సిద్ధం చేయడం, ఇంటీరియర్‌లను రిఫ్రెష్ చేయడం లేదా టైర్, బ్యాటరీ తనిఖీలతో సజావుగా ప్రయాణించేలా చూసు కోవడం ద్వారా ప్రయాణికులను వర్షాకాలంలో రోడ్డుపై సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించటానికి తోడ్పడుతుందన్నారు. టొయోటా సర్వీస్ క్యాంపెయిన్‌లో టైర్, బ్యాటరీ పరీక్షతో 20 పాయింట్ల ఉచిత వాహన తనిఖీ, లేబర్ ఛార్జీలపై 10 శాతం వరకు తగ్గింపు, టి గ్లోస్ మాన్సూన్ కేర్ ప్యాకేజీపై 10 శాతం తగ్గింపు, ఇంటీరియర్ క్లీనింగ్, విండ్‌షీల్డ్పాలిష్, హెడ్‌ల్యాంప్ పునరుద్ధరణ, వర్షాకాలంలో సరైన దృశ్యమానత, పరిశుభ్రత, సౌకర్యాన్ని నిర్ధారిస్తుందని, టైర్లు బ్యాటరీలపై ఆకర్షణీయమైన ఆఫర్‌లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం దక్షిణ భారతదేశంలో జూలై 2025 వరకు కొనసాగుతుందని చెప్పారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం విశాఖ ఎ కాలనీ పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార, శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చన్నారు. ఈ ప్రజాదర్బార్‌కు అధిక సంఖ్యలో మహిళలు, ప్రజల వచ్చి సమస్యలపై వినతులు అందజేశారు.

ఆర్‌టిసి అభివృద్ధికి ఎనలేని కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి పినకాన సంతోష్ కుమార్ అని పలాస ఆర్‌టిసి ఎన్‌ఎంయు నాయకులు అన్నారు. ఆర్‌టిసి డిపోలో శుక్రవారం పలాస నుంచి శ్రీకాకుళం ఆర్‌టిసి డిపో-1కు బదిలీపై వెళ్లిన అసిస్టెంట్ మేనేజర్ పినకాన సంతోష్ కుమార్‌కు ఎన్‌ఎంయు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయు రీజనల్ అధ్యక్షుడు పినకాని వాలి మాట్లాడుతూ సంతోష్ కుమార్ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేసిన సమయంలో ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా ఆర్‌టిసి ఉద్యోగులకు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. అనంతరం సంతోష్ కుమార్ మాట్లాడుతూ పలాస డిపో నుంచి బదిలీపై వెళ్లినా జిల్లాలో ఉంటానని, ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్న తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ప్రతిఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించి అధికారులకు అండగా ఉంటూ డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిసి సెక్యూరిటీ అధికారి జి. రామ్మోహనరావు, ఎన్‌ఎంయు అధ్యక్షుడు ఎ.వి. రావు, కార్యదర్శి హెచ్.వి మూర్తి, గ్యారేజ్ కార్యదర్శి డి.ఎల్ నారాయణ, పున్నయ్య, డి.శ్రీనివాసరావు, వాకనపురి శ్రీనివాసరావు, టి. పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.


సంతోష్ కుమార్‌కు సన్మానం చేస్తున్న యునియన్ నాయకులు


మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

రెడ్డీస్ లేబొరేటరీస్‌లో మాక్ డ్రిల్

రణస్థలం: ఫార్మాసిటీ వద్ద ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ లిమిటెడ్ సిటిఒ -సెజ్ యూనిట్‌లో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాను ఫ్యాక్చరింగ్ బ్లాక్‌లో స్ప్రే డ్రైయర్ వద్ద అగ్ని ప్రమాదం జరిగినట్టుగా ఊహించి చర్యలు చేపట్టారు. అప్రమత్తమైన రెస్క్యూ టీమ్ వెంటనే రంగంలోకి దిగి, ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అవసరమైన వారిని సమీప వైద్య కేంద్రాలకు పంపించారు. అగ్నిమాపక సిబ్బంది, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ల సమన్వయంతో మంటలను అదుపు చేసే ప్రక్రియను ప్రదర్శించారు. ఈ డ్రిల్‌ను పరిశ్రమల శాఖ ఉప ముఖ్య తనిఖీ అధికారి ఎల్.అశోక్‌రెడ్డి పర్య వేక్షించారు. ప్లాంట్ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ సిటిఒ సెజ్‌కు చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల విడుదలకు వినతి

ఇచ్ఛాపురం: 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌లు ఎంపిడిఒ రామారావుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన ముందుగా వైసిపి సర్పంచ్‌లు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీలో నెలకొంటున్న పలు సమస్యలు పరిష్కారంపై చర్చించారు. అనంతరం ఎంపిపి ఆధ్వర్యంలో వైసిపి సర్పంచ్‌లు ఎంపిడిఒకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, పాతర్ల రాజశేఖర్, తులసీరాం, వైసిపి నాయకులు వలపల రమణ, కారింగా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల పోలీసుల కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- రణస్థలం

ప్రజల రక్షణ, భద్రత, నేరాలు, నాటుసారా అక్రమ రవాణ, అక్రమ మద్యం బెల్టు షాపుల నిర్వహణ, గంజాయి అమ్మకాలు, చోరీలు నియంత్రణే లక్ష్యంగా జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలోని రణస్థలం మండల కేంద్రంలోని వెంకటేశ్వరా కాలనీలో శుక్రవారం వేకువ జామున 5 గంటల నుంచి జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది 'కార్డాన్ సెర్చ్' నిర్వహించి ఇళ్లల్లో బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్.పి. కె.వి.మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో గల వెంకటేశ్వరా కాలనీలో నేరాల నియంత్రణకు కార్డాన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గ్రామంలో నివాసం ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు, ప్రజల రక్షణకు భరోసా కల్పించేందుకు జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలోని జె.ఆర్.పురం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం ఎస్ఐలు, 30 మంది పోలీస్ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గ్రామంలోను, గ్రామ శివార్లలోను సోదాలు నిర్వహించామన్నారు. గ్రామంలో అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వేలిముద్రలను ఎం.ఎస్.సి.డి. పరికరాలతో తనిఖీలు చేసామన్నారు. అదే విధంగా వారి వద్ద లభించిన వాహనాల రికార్డులను పరిశీలించి, రికార్డులు సక్రమంగాలేని 19 ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం జె.ఆర్.పురం పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలతో ముందుగానే దిగ్బంధనం చేసామన్నారు. ముఖ్యంగా గంజాయి, మద్యం బెల్ట్ షాపులు, చోరీలు నియంత్రించాలనే లక్ష్యంతోనే ఈ సెర్చ్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: పట్టణంలో ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్-1, 2, 3 వీధుల్లో ఇంటింటికీ వెళ్లి వాహనాల వివరాలను సేకరించి రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని ఒక ఆటోను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టణంలో వీధుల్లో అనుమానితంగా, అపరిచిత వ్యక్తులు సంచరించినట్లుయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

శ్రీకాకుళం సిటీ: జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు రెండువ పట్టణ పోలీసుస్టేషన్ సిఐ ఈశ్వరావు తన సిబ్బందితో చౌదిరి సత్యనారాయణ కాలనీలో కార్డాన్ సెర్చ్ నిర్వహించి తనిఖీలు చేశారు. గంజాయి, మద్యం, నాటు సారా, నిషేధిత పదార్థాలు, అక్రమ నిల్వలపై సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులను విచారించి, పాత నేరస్తులు ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. వాహనాలు ధ్రువపత్రాలను పరిశీలించారు. పత్రాలు సక్రమంగా లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రణస్థలం : సోదాలు చేస్తున్న పోలీసులు

మెట్టూరు ఉప సర్పంచ్ చక్రపాణి మృతి

ప్రజాశక్తి - కొత్తూరు


చక్రపాణి (ఫైల్ ఫొటో)

మండలంలోని మెట్టూరు పంచాయతీ ఉప సర్పంచ్ చక్రపాణి (55) శుక్రవారం మృతి చెందారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన ఆయన్ను రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. 2021 ఎన్నికల్లో మెట్టూరు పంచాయతీ సర్పంచ్ మహిళా రిజర్వేషన్ కావడంతో చక్రపాణి ఆయన తల్లి కృష్ణమ్మని సర్పంచ్‌గా నిలబెట్టి గెలిపించడంతో పాటు ఆయన ఉప సర్పంచ్‌గా గెలుపొందారు. తదనంతరం తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో, ఉప ఎన్నికల్లో ఆయన చెల్లి రుక్మిణిని గెలిపించుకున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారంతో పాటు మెట్టూరు పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారు. చక్రపాణి గతంలో 'ప్రజాశక్తి'లో కొత్తూరు విలేకరిగా, పాలకొండ డివిజన్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో డివిజన్‌లో ప్రజాశక్తి పత్రిక అభివృద్ధి, విస్తరణకు కృషి చేశారు. ఆయన భార్య ఏకాశమ్మ ఎఎన్‌ఎంగా పనిచేస్తుండగా, కుమార్తె పూజిత ఎంబిబిఎస్ చదువుతున్నారు. చక్రపాణి మృతితో కుటుంబసభ్యులతో పాటు మెట్టూరు పంచాయతీ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. శనివారం ఉదయం మెట్టూరులో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

చక్రపాణి మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. చక్రపాణి ఉద్యమాలకు పలురూపాల్లో సహాయ సహకారాలు అందించేవారని తెలిపారు. ప్రజా ఉద్యమాలకు చేదోడువాదోడుగా నిలిచారని కొనియాడారు. చక్రపాణి మృతికి ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా సమన్వయ కమిటీ సంతాపం తెలిపింది. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి చక్రపాణి విశేష కృషి చేశారని ఒక ప్రకటనలో కొనియాడింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస: ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుని వయసు సుమారు 45 సంవత్సరాలు ఉండి ఎరుపు రంగు బనియన్, నలుపు రంగు షార్ట్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9493474582 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ మధుసూదనరావు తెలియజేశారు.

చోరీ కేసులో ఒకరు అరెస్టు

నరసన్నపేట: ఇటీవల జలుమూరు మండలంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడును అదుపులో తీసుకొని అరెస్టు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట సిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జలుమూరు మండలంలో యాల్లపేటలో జరిగిన రెండు వేరువేరు దొంగతనాల్లో మడ్డు మాధవరావు నేరాలకు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్ బాబు పాల్గొన్నారు.


గంజాయి కేసు వివరాలను వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మీసాల చిన్నం నాయుడు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టౌన్ ఎస్ఐ ముకుంథరావుకు అందిన సమాచారం మేరకు అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న కిరసిందూ నాయక్ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డాడని, నిందితుడు వద్ద నుంచి 2.150 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. సుమారు రెండు కేజీల గంజాయిని రూ.5 వేలకు కొనుగోలు చేసి దానిని తీసుకొని వారి గ్రామంలో బస్సుఎక్కి ఇచ్ఛాపురంలో దిగి, ఇచ్ఛాపురం నుంచి రైలులో చెన్నై వెల్లడానికి రైలు ఎక్కడానికి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు వెళుతుండగా గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుంథరావు ఉన్నారు.

క్రైమ్ కార్నర్


బోల్తాపడిన ఆటో

స్కూల్ ఆటో బోల్తా

పోలాకి: మండల పరిధిలోని నరసన్నపేట-పోలాకి రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో స్కూల్ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయ పడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.


కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

కుక్కల దాడిలో 10 మేకలు మృతి

కోటబొమ్మాళి: మండలం దుప్పిలపాడు గ్రామానికి చెందిన సబ్బి లక్ష్మణరావు, బిసింగి పొట్టోడులకు చెందిన మేకల పాకపై గురువారం రాత్రి వీధి కుక్కలు దాడి చేయడంతో 10 మేకలు మృతి చెందాయి. మేకలు పెంచుకొని వాటిపై వచ్చే ఆదాయంతో తమ కుటుంబాలు బతుకుతున్నామని, కుక్కల దాడితో మేకలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

కూలిన భారీ వృక్షం

పొందూరు: పొందూరు - చిలకపాలెం రహదారిలో భగవానుదాసు పేట (అన్నంపేట) వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కూలిన సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. వృక్షం రహదారికి అడ్డంగా ఉండిపోవడంతో అర్ధరాత్రి పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి ఎస్ఐ సత్యనారాయణ చేరుకుని జెసిబి సహాయంతో చెట్టును తొలగించారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం

ప్రజాశక్తి- బూర్జ

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామకమిటీలు పూర్తిస్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లివలసలో మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రజల మెప్పు పొందే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన బాధ్యత గ్రామ కమిటీలదే అని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు, మండల ఉపాధ్యక్షులు కస్యం నాయుడు, గోపి మాస్టర్, మజ్జి శ్రీరామనాయుడు, జగన్నాథంతో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యులు వీరే...

బూర్జ మండల టిడిపి అధ్యక్షునిగా వావిలపల్లి సీతారాం బాబు నాయుడు, మండల యూత్ అధ్యక్షుడిగా గేదెల నవీన్ కుమార్, గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు.



పలాస : నినాదాలు చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

ఆర్‌టిసిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు సమస్యలుగానే ఉండి పోతున్నాయని, తక్షణమే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం. అప్పలరాజు, కార్యదర్శి బెండి గోపి డిమాండ్ చేశారు. ఆర్‌టిసి డిపో వద్ద శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. 2019 సర్కులర్ అమలు పర్చాలన్నారు. డబుల్ డ్యూటీ చేసే సిబ్బందికి డిఎ పెంచాలని డిమాండ్ చేశారు. డిప్యూటేషన్లు బదిలీలపై విల్లింగ్ మేరకు పర్మినెంట్ బదిలీలు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన బస్సులు, బ్రేక్ డౌన్ అయిన గ్యారేజ్ సిబ్బంది బాధ్యులు కాదన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు ఆర్‌టిసి సొంతంగా నడపాలన్నారు. ఉద్యోగులకు గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జగ్గారావు, దాలినాయుడు, సంతోష్, ఎల్.ఎం రావు, కిరణ్‌కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రీజనల్ సంయుక్త కార్యదర్శి బడే మురళి, సంఘ నాయకులు డిపో కార్యదర్శి ఎస్. మోహనరావు, సిహెచ్ శ్రీనివాసరావు, పాపారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు వ్యాధి నిరోధక టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు గ్రామంలో ఉచితంగా థైలేరియోసిస్ వ్యాధి నివారణ టీకాలను 50 ఆవులకు గురువారం వేయటం జరిగిందని పశు సంవర్థకశాఖ సహాయ సంచాలకులు డా.మండ లోకనాథం, పశు వైద్యులు డా.కిరణ్ కుమార్ లఖినేని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి బాహ్యపరాన్న జీవులైన పిడుదులు (కొఱుసులు) ద్వారా థైలేరియో ఆన్యులేటా అను ప్రోటోజీవన్ క్రిమివలన ఎక్కువగా మేలు రకాలైన సంకరజాతి పశువుల్లో వస్తుందని, 105 – 106 డిగ్రీల వరకు జ్వరం, లింఫ్ గ్రంధులు, రక్త హీనత వంటి లక్షణాలతో చనిపోతాయన్నారు. ఈ టీకా వేశాక 21 రోజుల వరకు యాంటీ బయాటిక్స్, ఇతర వ్యాధి నివారణ టీకాలు, యాంటీ ప్రోటోజోవల్ మందులు వాడ కూడదన్నారు.

టిబి వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

టిబి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో ఎవరైనా టిబి వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తిస్తే ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని పలాస టిబి యూనిట్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు అన్నారు. మండలం లొద్దభద్రలో రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టిబి ముక్తి భారత్ అభియాన్ ఇంటిన్స్ ఫైడ్ టిబి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి రోగులకు వ్యాధిపై అవగాహన కల్పించి, వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం వై.పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ లొడగల కామేశ్వరరావు, ఎంఎల్‌హెచ్ పి.సుధారాణి, ఆరోగ్య సిబ్బంది ఎం.ఝాన్సీ దేవి, డిఇఒ వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఏడాదిలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మండలం హనుమంతు నాయుడుపేటలోని జెడ్‌పిటిసి వసంత రెడ్డి కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్టని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 143 హామీల్లో ఏఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మార్గదర్శకాలను నాయకులకు వివరించారు. కింజరాపు కుటుంబీకులు ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం జిల్లా కమిటీకి ఎన్నికైన నక్క భీమారావు, ఎన్ని మన్మధరావు, మార్పు అశోక్ చక్రవర్తిని సాలువతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు సుగ్గు రామిరెడ్డి, జోగి రాములమ్మ, ఆర్.రాంరెడ్డి, అంగ జనార్ధన్, జీరు బాబురావు పాల్గొన్నారు.

రూ.15 లక్షల ప్రోత్సాహకం మంజూరు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఇంక్యూబెసన్ సెంటర్ ద్వారా తక్కువ ఖర్చుతో కూడిన ఆటోమేటెడ్ బ్యాటరీ ఛార్జింగ్ సిస్టమ్ ఫర్ ఈ–వెహికల్స్ అనే ఐడియాను విద్యార్థి కేటగిరీ కింద ప్రోటోటైట్గా పెంపొందించడం, అభివృద్ధి చేయడం కోసం ఎంఎస్ఎంఇ ఐడియా హ్యాకథాన్ 4.0 కింద ఐతమ్ ఇంక్యుబేషన్ సెంటర్‌కు రూ.15 లక్షలు ప్రోత్సాహకం మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయోగానికి సలహాదారుగా అధ్యాపకులు డాక్టర్ జి.సతీష్ కుమార్, డాక్టర్ పల్లి శ్రీహరి, ముఖ్య సలహాదారుగా, ముఖ్య సమన్వయ కర్తగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి ప్రోత్సాహంతో విద్యార్థులు రత్నాల అలేఖ్య ఇసిఇ, సాధు ఉమా చంద్రసాయి, ఇసిఇ, యూన ప్రవల్లిక ఇసిఇ, కొండాల దిలీప్ కుమార్ ఇసిఇ, ఎ.జ్యోత్స్న, మెకానికల్, ఎం.నిరంజన్ ఇఇఇలకు డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎఎస్ శ్రీనివాసరావు, ఇఇఇ హెచ్‌ఒడి డాక్టర్ విజయ్ కుమార్, ఇసిఇ హెచ్‌ఒడి డాక్టర్ అశోక్, మెకానికల్ హెచ్‌ఒడి శ్రీహరి ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ సీట్లు మంజూరు చేయాలి

టెక్కలి రూరల్: ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ సీట్లు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షులు తలసముద్రం సూర్యం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి, స్థానిక అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి త్రినాథరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ టెక్కలిలో ప్రభుత్వ, ప్రైవేటు, జూనియర్ కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువు తున్నారని, కాలేజీలు తెరిచి నెలలు గడుస్తున్నప్పటికీ స్థానిక బిసి బాలికల కళాశాల వసతిగృహంలో సీట్లుకోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నప్పటికీ సీట్లు మంజూరు చేయకపోవడం వలన దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల కాలం, ధనం వృధా అవుతుందన్నారు. తక్షణమే వారికి సీట్లు మంజూరు చేసి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో పి.సోనియా, కె.జ్యోత్స్న, టి.జ్యోత్స్న, పి.రజిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'తొలి అడుగు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం గార మండలం బందరువాణి పేట, కళింగపట్నం, కె. మత్యలేశం గ్రామాల్లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరించారు. అనంతరం అయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీందర్, నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: పట్టణంలో 10వ వార్డులో మఠంవీధి, భైరివీధి, మార్కెట్ వీధుల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని అప్పలపేటలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు వి.సీతారాం బాబు నాయుడు, సర్పంచ్ కొరికాన వెంకట సీతారామరాజు, ఎంపిడిఒ తిరుపతిరావు, వివిధ శాఖ



నరసన్నపేట : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నీటి సంఘ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం అన్నారు. మండలం కేసుపురం పంచాయతీలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దక్కత ఢిల్లీరావు, డి.కామేశ్వరరావు, ఎస్.సహదేవ్ రెడ్డి, ఎం.సూర్యనారాయణరెడ్డి, పి.బాబ్జి, ఆశి మాధవ రెడ్డి, వడ్డిన ధర్మరాజు, పాతిర్ల చంద్రశేఖర్ రెడ్డి, బి.లోహిదాస్, కోట శంకర్, బి.శ్యామసుందర్, పిట్ట పురుషోత్తం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే గూడ్స్ షెడ్ తరలింపు అన్యాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస



మాట్లాడుతున్న రవికుమార్

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వార్థం, ఎమ్మెల్యే కూన రవికుమార్ చోద్యం చూస్తుండడం వలన రైల్వే గూడ్స్ షెడ్‌ను హరిశ్చంద్రపురానికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడి గూడ్స్‌షెడ్ మీద ఆధారపడి 11 గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి కుటుంబాలు తమ జీవనాధారాన్ని కొనసాగిస్తున్నాయన్నారు. ఆమదాలవలసలో మిగిలిన ఏకైక ఉపాధి మూలాన్ని కూడా కేంద్రమంత్రి తన కుటుంబ ప్రయోజనాల కోసం తరలిస్తుంటే, ఎమ్మెల్యే మాత్రం చోద్యం చూస్తున్నారని అన్నారు. కుటుంబ పాలనతో ఇప్పటికే నష్టపోయిన ప్రజలకు ఇది మరోపెద్ద ఎదురదెబ్బని వాపోయారు. ఉపాధి లేక వలసలు తప్పడం లేదని ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎంపీ, ఎమ్మెల్యేలు తమ బాధ్యతను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇప్పటికైనా గూడ్స్‌షెడ్ తరలింపును అడ్డుకునేందుకు కేంద్రమంత్రిని నిలదీయాలని లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పొందూరు వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన సూరపునాయుడు, వైసిపి జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, కొత్తవలస వైస్ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, నాయకులు సీర హరి, రాము, శ్రీరామ్, చిన్నబాబు, శ్రీను, గిరి తదితరులు పాల్గొన్నారు.

తెలగలను బిసి జాబితాలో చేర్చకపోతే ఆమరణ దీక్ష



మాట్లాడుతున్న పివిఆర్ తదితరులు

ప్రజాశక్తి- లావేరు

తెలగ సామాజిక తరగతిని ప్రభుత్వం బిసి జాబితాలో చేర్చకపోతే ఆమరణ నిరహార దీక్షకు తాము సిద్ధంగా ఉన్నామని ఉత్తరాంధ్ర తెలగ సంఘం ఉద్యమ నాయకులు పళ్ళంట్ల వెంకట రామారావు (పివిఆర్) హెచ్చరించారు. మండల కేంద్రంలో శుక్రవారం వంగవీటి మోహన్‌రంగా 78వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. వి.ఎం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ముందుగా సుభద్రాపురం కూడలి నుంచి లావేరు వరకు తెలగ నాయకులు, రంగా అభిమానులు వందలాది ద్విచక్ర వాహనాలు, కార్లుతో భారీర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగా సేవలు, త్యాగాలు, నాయకత్వ పటిమను ఇప్పటికీ ప్రతిఒక్కరూ స్మరించు కుంటారని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రంగ అండదండగా ఉన్నారని చెప్పారు. విజయవాడకు బతుకు తెరువుకోసం వెళ్లిన ప్రతిఒక్క కుటుంబానికి ఆత్మ బంధువుగా అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. రంగా పేద ప్రజలు కోసం నిరంతరం పోరాటం చేసారని, సామాజిక న్యాయం కోసం అవిశ్రాంతంగా పోరాడిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఉత్తరాంధ్రలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న తెలగ సామాజిక వర్గాన్ని ఆదుకోవాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకులు ముప్పిడి సురేష్, యినపకుర్తి తోటయ్యదొర, పైడి శ్రీను వాసరావు, లంకలపల్లి ప్రసాద్, సిపి బాలబొమ్మ, వెంక టేశ్వరరావు, బి.చిన్నశ్రీను, పి.అప్పడుదొర, కాయల రమణ, దేశెట్టి తిరుపతిరావు, రాయపురెడ్డి బుజ్జి, పార్టీలకు అతీతంగా తెలగ సామాజిక తరగతి ప్రతినిధులు పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. రణస్థలం క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై నియోజకవర్గ స్థాయి అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 8న మధ్యాహ్నం 3 గంటలకు రణస్థలం మండల కేంద్రంలోని పాత పెట్రోలు బంక్ ఎదురుగా శ్రీ వెంకటేశ్వర కళ్యాణ వేదికలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైసిపి మండల అధ్యక్షులు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేరోజు ఉదయం 9 గంటలకు దివంగత నాయకులు డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయా మండలాల్లో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణ రావు, జిల్లా ఉపాధ్యక్షులు బొంతు సూర్యనారాయణ, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు నేతింటి నీలమప్పడు, ఎంపిపి ప్రతినిధులు మీసాల వెంకట రమణ, రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసిలు బల్లాడ హేమామాలిని రెడ్డి, కాయల రమణ, వైస్ ఎంపిపిలు లుకలాపు శ్రీనివాసరావు, రాయపురెడ్డి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల అభివృద్ధికి సహకరించాలి

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు అందరు సమిష్టిగా కృషి చేసి సహకరించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధికి ఏం చేయాలో అధికారులు, రాజకీయ నాయకులు కలిసికట్టుగా ముందుకెళ్లడానికి ఇది ఒక వేదిక కావాలన్నారు. లావేరు, జి.సిగడాం వ్యవసాయ ఆధారిత మండలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు నెలకొల్పే విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లానని, అలాగే నూతనంగా పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందు తుందన్నారు. ఎచ్చెర్ల మండలంలో ఉన్న ఎడ్యుకేషన్ హబ్ మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిఎంసి చైర్మన్ చౌదరి అవినాష్, రాష్ట్ర రజిక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, కూటమి నాయకులు లెంక శ్యామల రావు, పిసిని జగన్నాథం నాయుడు, డిజిఎం ఆనంద రావు, పిన్నింటి భానోజీనాయుడు, ముప్పిడి సురేష్, వడ్డాది శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, అన్నెపు భువనేశ్వర రావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, తహశీల్దార్ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.



కృష్ణాపురం వద్ద రహదారి పక్కన అనుమానిత ద్విచక్ర వాహనం

ఈ ద్విచక్ర వాహనం ఎవరిది...?

పొందూరు: పొందూరు–చిలకపాలెం రహదారిలో కృష్ణాపురం (గారపేట) గ్రామం వద్ద రహదారి పక్కన నాలుగు రోజులుగా నిలిచి ఉన్న ద్విచక్రవాహనం ఎవరదంటూ పరిసర గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామ సమీపంలో ఎపి 16 బిజె 5578 నెంబర్ గల హోండా ద్విచక్రవాహనం రహదారి పక్కనే వదిలివేసి వెళ్లిపోయారు. ముందుగా ఎవరో పార్కింగ్ చేశారని అందరూ భావించగా, నాలుగు రోజులుగా అలాగే ద్విచక్రవాహనం ఉండడంతో అనుమానాలకు తావిస్తుంది. ఎక్కడో దొంగిలించి తెచ్చి రాత్రివేళ ఇక్కడ వదిలివేసి ఉంటారంటూ పలువురు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎపి 16 అంటే విజయవాడ రిజిస్ట్రేషన్ కిందకు రావడంతో మరింతగా దొంగలించబడ్డ వాహనం అయింటుందంటూ పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పొందూరు మండలంలో పలు గ్రామాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువగా చోటుచేసుకోవడంతో అదే విధంగా ఈ వాహనాన్ని దొంగిలించి ఉండవచ్చునని చర్చించుకుంటున్నారు. పోలీసులు వెంటనే ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, విచారణ జరపాలంటూ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిన్నారికి రక్తదానం

పలాస: తలసేమియాతో బాధపడుతున్న ఓ బాబుకు పూజ అనే మహిళ శుక్రవారం రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యుల సహకారంతో బ్లడ్ ఇస్తున్న జస్వంత్ అనే బాబు కోసం రక్తాన్ని సేకరిస్తున్నారు. అందులో భాగంగా ఆ ట్రస్ట్‌కు చెందిన టెక్కలి మండలం బొప్పాయిపురానికి చెందిన పూజ ఎబి పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. పసి ప్రాణం కాపాడుకునేందుకు మానవత్వంతో ఇప్పటికే ఎంతోమంది దాతలు ముందుకు వస్తున్నారని, మహిళలు కూడా రక్తదానానికి ముందుకు వస్తున్నారని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



ఇచ్ఛాపురం : చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ రామారావు

ప్రజాశక్తి- లావేరు

ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. శుక్రవారం అప్పాపురంలో తడి చెత్త, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి రెండు బుట్టలు ఇవ్వడం జరిగిందని అందులో ఇంటివద్దనే తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి బుట్టలో వేయాలన్నారు. తడిచెత్తను అదేరోజు గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జె.సత్యనారాయణ, కూటమి నాయకులు బాసిన దాలిరాజు, కార్యదర్శి సుజాత, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో హరిపురం పంచాయతీలో ఇంటింటా చెత్త సేకరణపై ఎంపిడిఒ రామారావు ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీకి కావాల్సిన బ్లీచింగ్ పౌడర్ సిద్ధం చేసుకొని ఉంచుకోవాలన్నారు. అనంతరం తాగునీటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దక్కత రామారావు, వడ్డిన ధర్మారాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బొరివంక, బల్లిపుట్టుగ గ్రామాల్లో ఎంపిడిఒ ఎల్.త్రినాథ్ ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ పారిశుధ్య నిర్వహణపై పోస్టర్లు పంచిపెట్టి పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ అబ్దుల్ ఖాన్, కార్యదర్శి గుణవతి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని చిల్లపేటరాజాం పంచాయతీలో డిప్యూటీ ఎంపిడిఒ వి.ప్రకాశరావు సందర్శించారు. తాగు నీటి ట్యాంక్‌ను పరిశీలన చేసి క్లోరినేషన్ టెస్ట్ చేశారు. ఇళ్లల్లో చెత్తను తడి పొడిగా వేరుచేసి క్లాత్ మిత్రకు అందించాలన్నారు. గ్రామపెద్దలు, కార్యదర్శి ఆర్.శ్రీధర్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువులది ప్రత్యేక స్థానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

సమాజంలో గురువులది ప్రత్యేక స్థానమని ఉపసర్పంచ్ ఫాతిన చంద్రశేఖర్, గ్రామ పెద్ద పండి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన హెచ్‌ఎం శాంతి, ఉపాధ్యాయులు రామకృష్ణకు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ చిరంజీవమ్మ, వైస్ చైర్మన్ మాధవరావు, గ్రామస్తులు పాతిన వెంకటరావు, పి.పద్మనాభం, ఆర్.నారాయణరావు, పి.వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: ప్రతి ఉద్యోగికి విధి నిర్వహణలో బదిలీలు సహజమని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.రవికుమార్ అన్నారు. పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులకు విద్యార్థులు, ప్రస్తుత ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో విద్యార్థులకు, గ్రామానికి అందించిన సేవలు మైలురాళ్లుగా నిలుస్తాయన్నారు. బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, బాడాన రాజు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, బి.నాగమణి, కె.తవిటిరెడ్డి, పి.తిరుపతి రావులను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముందస్తు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం టౌన్ సబ్ డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు నిర్వహించాలన్నా సంబంధిత పోలీసు వారి ముందస్తు అనుమతి తప్ప నిసరిగా తీసుకోవాలని శ్రీకాకుళం టౌన్ డిఎస్‌పి సిహెచ్ వివేకానంద తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్, ధర్నాలు నిర్వహించా లనుకునే రాజకీయ పార్టీలు, మత సంస్థలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర సంఘాల వారు ఒక వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పరిధిలో పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ వద్ద పోలీస్ వారు నిర్దేశించిన అనుమతులను ముందుస్తుగా తప్పనిసరిగా ఉండాలని డిఎస్‌పి తెలిపారు. అదేవిధంగా వాటికి దరఖాస్తు చేసునే వ్యక్తులు వారి యొక్క మొత్తం వివరాలు, ఎందుకు నిర్వహిస్తున్నారు, ఎంత మంది వస్తున్నారు, ప్రారంభ సమయం, ముగింపు సమయం, రూట్, స్థలం వంటి అంశాలు తెలియ జేయాలని చెప్పారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసు కుంటామన్నారు.

లైసెన్స్‌లేని షాపుల్లో మద్యం కొనొద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తులు వద్ద నుంచి మద్యం కానుగోలు చేయడం చాల ప్రమాదకరమన్నారు. వివాహాలు, పార్టీలు లేదా ఇతర సాముహిక వేడుకల్లో మద్యం తక్కువ ధరకు అందిస్తామని చెప్పేవారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్కువ ధరకు అందించే మద్యంలో కల్తీ, మోసం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వారు సరఫరా చేసే మద్యం ఆరోగ్యానికి హాని కలిగించవచ్చునని, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీయవచ్చునని ఆయన తెలిపారు. అటువంటి వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలు, వాటికి సంబంధించిన శిక్షలపై స్థానిక ఎస్‌ఐ లవరాజు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సంస్కార భారతి విద్యా సంస్థల వద్ద విద్యార్థులు, మహిళలు, బాలికలపై జరుగుతున్న వివిధ రకాల భౌతిక, మానసిక దాడులపై అవగాహన కల్పించారు. పోలీస్‌శాఖ రూపొందించిన శక్తియాప్‌పై తెలియ జేశారు. ఎటువంటి ఆపద సమయంలోనైనా శక్తియాప్ ద్వారా రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శక్తియాప్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవి, కరస్పాండెంట్ ఎన్.దాసు, చైర్మన్ వై.దేవరాజు, పాపారావు, ప్రిన్సిపాల్ కవిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో ప్లాస్టిక్, చెత్తను తొలగించారు. మెయిన్ గేట్ చుట్టూ పెరిగిపోయిన పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, వెల్ఫేర్ డీన్ డా.గేదెల రవి, జాతీయ సేవా పథకం కో–ఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుంధరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వి.సింహాచలం, అసిరినాయుడు, ఆర్.పద్మావతి, గాయత్రి, ప్రశాంత్ కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.



చెట్టుకొమ్మల తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఎఇ సుధీర్

చెట్టుకొమ్మల తొలగింపు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల్లో భాగంగా విద్యుత్‌శాఖ ఎఇ సుధీర్ ఆధ్వర్యంలో శుక్రవారం చెట్టు కొమ్మలను తొలగించారు. పొందూరు–చిలకపాలెం రహదారిలో విద్యుత్ వైర్లుకు ఆనుకొని చెట్టు కొమ్మలు ఉండడంతో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో భాణాం ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ లైన్లుకు మరమ్మతులను చేపట్టారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

టెక్కలి: విశాఖపట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 6న ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలో చేపట్టనున్నామని చదరంగం జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. 15 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. జిల్లా జట్టు ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు రూ.300 ప్రవేశరుసుం చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9912559735 నంబర్‌కు సంప్రదించాలని కిషోర్, రమేష్ తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలస గ్రామ బిసి, ఎస్‌సి కాలనీలో గత కొన్నేళ్లుగా వెంటాడుతున్న విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే కూన రవికుమార్ పరిష్కరించారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కాలనీలో ఉన్న విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే స్థితిలో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి మాజీ ఎంపిటిసి తాడేల వెంకటరమణ, విశ్రాంత ఉపాధ్యాయుడు తొత్తడి వైకుంఠరావు, టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు తీసుకువెళ్లారు. విద్యుత్ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ డిఇతో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. డిఇ మండల విద్యుత్ ఇంజినీరింగ్ అధికారికి చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో శుక్రవారం రొట్టవలసలో సమస్యను పరిష్కరించడానికి కావాల్సిన విద్యుత్ పరికరాల అంచనాల నివేదికలను రూపొందించారు. అనంతరం మండల అధికారులు గ్రామ టిడిపి నాయకులకు నివేదికలను అందించి త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.